క్లుప్తంగా

వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు



గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేం చేసి ఉన్న శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. తెల్లవారుజామున శ్రీగోదాదేవి సమేత శ్రీకృష్ణాస్వామివార్లకు విశేష అర్చనలు జరిపారు. అనంతరం నగర సంకీర్తన, తిరుప్పావై ప్రబంధ పారాయణం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా జనవరి 2వ తేదీన శ్రీగోదాదేవి అమ్మవారికి సారెను సమర్పించనున్నట్లు ఆలయ అర్చకులు ఎస్. రామాచార్యులు తెలిపారు. అమ్మవారికి వివిధ రకాల పండ్లు, పూలు, పిండి వంటలు, అలంకరణ సామగ్రి, నూతన వస్త్రాలు సమర్పిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్ కాలువ కట్టకు చెందిన నీలం మహాలక్ష్మి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. ఆమె కుమార్తె నీలం కావ్యశ్రీ విజయవాడలో డిగ్రీ చదువుతోంది. ఆమె ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కావ్యశ్రీ తన మిత్రురాలితో ఫొటో దిగిన తరువాత ఆ ఫొటోను ఒక యువకుడికి పంపిన విషయం కాలేజీలో యాజమాన్యానికి తెలిసి మందలించారు. ఈ విషయం ఆమె తండ్రి ఆదినారాయణకు కావ్యశ్రీ మిత్రులు ఫోన్ చేసి చెప్పారు. దీంతో కావ్యశ్రీ భయపడి ఇంటికి రాలేదని అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కానూరులో రహదారుల ప్రారంభం



పెనమలూరు: కానూరులో రెండు సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. రూ.1.40 కోట్లతో నిర్మించిన శ్రీరామ్‌నగర్ కాలనీ, మన కల్యాణ మండపం ప్రధాన రహదారులను ప్రారంభించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వం అనేక రహదారులు నిర్మాణం చేసిందన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానిప్రసాద్, టీడీపీ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు, ఆయా కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలి

పటమట(విజయవాడతూర్పు): మున్సిపల్ మినిస్ట్రీయల్ ఉద్యోగులు సంఘటితమైతేనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దొప్పలపూడి ఈశ్వర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అసోసియేషన్ హాల్లో ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్‌పై అందరికీ అవగాహన ఉండాలని, మున్సిపల్ శాఖలో సిబ్బంది సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం కదిలేలా ఉద్యోగులు ఒత్తిడి తీసుకురావాలన్నారు. సంఘ వీఎంసీ అధ్యక్షుడు తిమ్మసర్తి నాగేశ్వరరావు, ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.శివరాం ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, వీరభద్రయ్య, దేవరాయలు, కోశాధికారి ఎం.రవి, సెక్రటరీ కళ్యాణ్ చక్రవర్తి, రవిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గాలి సుధాకర్, జాయింట్ సెక్రెటరీ రాజేష్, ప్రదీప్ కుమార్, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చురీ ఫ్రీజర్ బాక్స్ అందజేత



పెనమలూరు: పెదపులిపాకలో మార్చురీ ఫ్రీజర్ బాక్స్‌ను ఆదివారం దాతలు వితరణ చేశారు. గ్రామానికి చెందిన పోలవరపు బోస్‌బాబు, లక్ష్మిసామ్రాజ్యం ఇటీవల మృతి చెందటంతో ఆయన కుటుంబ సభ్యులు వారి జ్ఞాపకార్థం సుమారు రూ.లక్ష విలువ చేసే మార్చురీ ఫ్రీజర్ బాక్సును గ్రామ పంచాయతీకి అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సర్పంచి గుంటూరు శ్రీనివాసాచౌదరి, మునునూరు శ్రీధర్, బోసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కొత్తగూడెం ఊర చెరువు

- కోతకు గురవుతున్న చెరువు అంచు
- పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



వీరపనేనిగూడెం పోలవరం వంతెన వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గొయ్యి



ప్రమాదకరంగా కొత్తగూడెం ఊర చెరువు



కోతకు గురవుతున్న రహదారి

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెం – కొత్తగూడెం రహదారి అధ్వానంగా మారి, ప్రమాదాలకు నిలయంగా తయారైంది. వీరపనేనిగూడెం నుంచి కొత్తగూడెం, చిక్కవరం నిత్యం ప్రయాణాలు ప్రజలు చేస్తుంటారు. ఈ మూడు గ్రామాలకు అవసరమైన బ్యాంకింగ్ సేవలు, ప్రైవేటు విద్యా సంస్థలు వీరపనేనిగూడెంలో ఉన్నాయి. రైతులు నిరంతరం బ్యాంకింగ్ సేవల కోసం వీరపనేనిగూడెం వస్తుంటారు. ఈ క్రమంలో కొత్తగూడెం చెరువు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులు రోజూ ఈ రహదారిపై నడుస్తుంటాయి. చెరువు అంచు తెగిపోయి, కోసుకుపోయి, విరిగి పడిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. పట్టించుకోవాల్సిన ప్రభుత్వ శాఖలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి.

దెబ్బతిన్న చెరువు అంచు

కొత్తగూడెం గ్రామానికి తూర్పున చెరువు ఉంది. ఈ చెరువులో సాగునీరు నిల్వ ఉంటుంది. గ్రామంలో పశుసంపద ఎక్కువగా ఉంది. మండలంలోనే పశుసంపద అధికంగా ఉన్న గ్రామం కొత్తగూడెం. ఆ పశువులు ఈ చెరువులోనే నిరంతరం సేదతీరుతాయి. ఇక్కడ నుంచి మేతకు వెళ్తుంటాయి. రైతులు పంట భూములను సాగుచేసుకునేందుకు ఈ చెరువు నీరు ఉపయోగిస్తారు. రోజూ పశువులు చెరువు అంచు తొక్కివేయడంతో పూర్తిగా దెబ్బతినిపోయింది. ఈ చెరువు దెబ్బతిన్న అంచునే వీరపనేనిగూడెం – కొత్తగూడెం రహదారి ఉంది. ఈ రహదారిపై రోజు బస్సులు, ట్రాక్టర్‌లు, లారీలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు విద్యార్థులను ఎక్కించుకుని రోజు వీరపనేనిగూడెం తీసుకువెళ్లి మరలా సాయంత్రం ఇళ్లకు కొత్తగూడెం, చిక్కవరం తీసుకువస్తుంటాయి.

రహదారి బాగు చేయించాలి..

ఈ రహదారి మార్గాన్ని బాగు చేయించాలని ఎంతో కాలంగా గ్రామస్తులు కోరుతున్నారు. అయినా అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. దీంతో ఈ రోడ్డు రోజురోజుకు మరింతగా దెబ్బతింటుంది. ఈ చెరువును ఆనుకుని సచివాలయం నిర్మాణం జరుగుతోంది. రైతు సేవా కేంద్రం, వాటర్ ప్లాంట్ కూడా అక్కడే ఉంది. గ్రామ రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు ఈ పరిసరాలనే వినియోగిస్తారు. రైతులు పండించిన ధాన్యం లారీలకు ఎగుమతులు కూడా ఇక్కడ నుంచే కొనసాగుతుంటాయి. ఇంతటి విశిష్టత కలిగిన రోడ్డు విస్తరించి, చెరువు అంచు రివిట్‌మెంట్ నిర్మించాలని ఆ గ్రామస్తులు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే చెరువు పలు చోట్ల రహదారిని కోసివేసి రోడ్డుపైకి నీళ్లు వచ్చాయి. ప్రజలు వాహనాలను పక్క నుంచి జాగ్రత్తగా వెళ్తున్నారు.

రోడ్డును విస్తరించాలి..



చెరువు వెంట రహదారిపై ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది. భయాందోళనతో రాకపోకలు సాగిస్తున్నాం. చెరువుకు రివిట్‌మెంట్ నిర్మించి ఆదుకోవాలి. రోడ్డును విస్తరించి నిర్మించాలి. దీంతో అందరికీ మేలు జరుగుతుంది.

– రాజారత్నం, గ్రామస్తుడు, బల్లిపర్రు

చెరువుకు రివిట్‌మెంట్, గోడ నిర్మించాలి



కొత్తగూడెం వద్ద చెరువు పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. బస్సులు, ట్రాక్టర్‌లు, లారీలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతున్నాయి. అధికారులు పరిశీలించాలి. చెరువుకు రివిట్‌మెంట్, గోడ నిర్మించి ప్రమాదాలు నివారించాలి. రోడ్డు అభివృద్ధి చేయాలి.

–మిరప నాగేశ్వరరావు, సీపీఎం మండల నాయకుడు

హోరాహోరీగా డబుల్ బ్యాడ్మింటన్ పోటీలు



ఉయ్యూరు: ఉయ్యూరు బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో డబుల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. ఉయ్యూరు పరిసర గ్రామాలకు చెందిన క్రీడాకారులు 70 మంది పోటీల్లో పాల్గొని నువ్వా నేనా అన్నట్లు తలపడ్డారు. పోటీల్లో ఎనిమిది మంది క్రీడాకారులను విన్నర్స్, రన్నర్స్‌గా ప్రకటించి విజేతలకు విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు దండమూడి బాలకృష్ణ బహుమతులు అందజేశారు. పోటీలను మురళీ, రామకృష్ణ, నరేష్, కృష్ణ, వెంకన్న, శివ, సాయి పర్యవేక్షించారు.

దత్తపీఠంలో ఉచిత యోగా శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): పటమట దత్తపీఠంలో ఈ నెల 31న ఉచిత దత్తక్రియా యోగ సాధన నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త దంతలూరి తిరుపతి రాజు ఆదివారం తెలిపారు. ఈ నెల 31 దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానం స్వామి సమక్షంలో పటమటలోని దత్తపీఠంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జరుగుతుందని, యోగ సాధనకు 12ఏళ్లు దాటిన వారందరూ అర్హులేనని వివరాలకు 98660 41332 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ప్రభుత్వం మాట తప్పింది



గన్నవరంలో మాట్లాడుతున్న నాయకులు



యనమలకుదురులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

గన్నవరం: విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల విషయంలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వం మాటతప్పి ప్రజలపై రూ.15,484 కోట్లు సర్దుబాటు చార్జీల భారం వేసిందన్నారు. ఈ నెల నుంచి విద్యుత్ చార్జీలను కూడా పెంచారని, పాత మీటర్ల తొలగించి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి సరికొత్త దోపిడీకి పాల్పడుతున్నారని చెప్పారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల సెల్‌ఫోన్లు మాదిరిగానే కరెంట్ కోసం ముందుగానే రీ చార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టడం ద్వారా ఉచిత విద్యుత్‌కు ఎసరు పెడుతున్నారని రైతు సంఘం జిల్లా నాయకులు సూరగాని సాంబశివరావు ఆరోపించారు. పార్టీ నాయకుడు గుండిమేడ ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

పెనమలూరు: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సీపీఎం నేతలు యనమలకుదురులో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి షేక్.కాశిం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రూ.16 వేల కోట్లు ప్రజలపై భారం మోపిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. ఈ విషయంలో ప్రజలు వాస్తవాలు ఆలోచించి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు షేక్.మస్తాన్‌వలి, షేక్.బాబు, షేక్.వలిబీ, పల్లా చిన పాపారావు, సత్యం, పాలా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌ఎంసీ, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం

కంకిపాడు: ఎస్‌ఎంసీ, ఉపాధ్యాయుల మండల స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఈనెల 31వ తేదీ మంగళవారం ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ–2 కె.ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఎస్‌ఎంసీ సభ్యులు ఒకరు, ఒక ఉపాధ్యాయుడు శిక్షణకు హాజరుకావాలన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా రేషన్ డీలర్ల ఎంపిక రాతపరీక్ష



ఉయ్యూరు: రేషన్ డీలర్ల అభ్యర్థుల ఎంపిక రాతపరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 46 రేషన్ దుకాణాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. 103 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 68 దరఖాస్తులను అధికారులు అర్హులుగా గుర్తించారు. అర్హత గల అభ్యర్థులకు ఆదివారం ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 67 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని ఆర్డీఓ షారోన్ పరిశీలించారు.

ప్రాణశక్తిని కాపాడుకోవాలి



పెనమలూరు: ప్రాణశక్తిని కాపాడుకుంటేనే జీవించగలుగుతామని యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. ఆయన ఆదివారం కానూరులో వివరాలు తెలుపుతూ కానూరు అశోక్‌నగర్ తన కార్యాలయంలో జనవరి 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రాణశక్తి పెంపు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రాణశక్తి మనుషుల్లో పుష్కలంగా ఉండేదన్నారు. ఇప్పుడు ప్రాణశక్తి తగ్గి మనిషి ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 60 శాతం ప్రాణశక్తి ఉన్నవారు ఎక్కువగా ఉండే వారని ఇప్పుడు అటువంటి వారు కనబడటం లేదన్నారు. ప్రాణశక్తి కనీసం 3 శాతం ఉంటేనే మనిషిలో కదలిక ఉంటుందని చెప్పారు. 10 శాతం ఉంటేనే నడవగలుగుతారని, 30 శాతం ఉంటూ 10 కిలోమీటర్లు నడవగలుగుతారన్నారు. ఇప్పుడు 40 శాతం మించి ప్రాణశక్తి ఉన్న వారు కనబడటం లేదన్నారు. తాము నిర్వహించే ప్రాణశక్తి శిక్షణ తరగతుల్లో పాల్గొని పూర్తి అవగాహన పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 9000347369 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మాదిగ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పట్టుదల, నిరంతర కృషితో మాదిగ యువత వ్యాపార, వాణిజ్య రంగాల్లో రాణించాలని, తద్వారా సామాజిక, ఆర్థిక వెనుకబాటును సమూలంగా పారద్రోలగలమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఇంటర్నేషనల్ ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ (ఇన్ఫామ్) ఆధ్వర్యంలో 7వ ప్రపంచ మాదిగ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఇన్ఫామ్ ఆధ్వర్యంలో నూతనంగా ఇంటర్నేషనల్ మాదిగ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ ఇండస్ట్రీ అనే సంస్థను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ మాదిగ వర్గీయులు ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి..

ఏపీ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మారెడ్డి శివశంకర్‌రావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న పలు పథకాలు, సబ్సిడీలను మాదిగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఔత్సాహిక మాదిగ పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే రాష్ట్ర ప్రభుత్వంలో చర్చించి మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో భూములు కేటాయిస్తామని చెప్పారు. అంతకు ముందు ఇన్ఫామ్ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, సామాజిక చైతన్య గీతాలు హుషారెత్తించాయి. తిరువూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు కొలికపూడి శ్రీనివాసరావు, బూర్ల రామాంజనేయులు, ఇన్ఫామ్ వ్యవస్థాపకుడు గెడ్డం బాపిరాజు, రాష్ట్ర అధ్యక్షుడు మట్టా విద్యార్థి, ఇంటర్నేషనల్ మాదిగ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ ఇండస్ట్రీ రావుల రాజేంద్రప్రసాద్, జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, పలువురు మాదిగ ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతో ఉన్నత స్థానాలు



విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న అతిథులు

గన్నవరంరూరల్: విలువలతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చుతుందని ప్రముఖ దంత వైద్య నిపుణుడు డాక్టర్ కొడాలి జె.రమేష్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎంతో గొప్ప విలువలు కలిగిన విద్యాసంస్థలో చదువుకున్న మీరందరూ ప్రపంచంలోని నలుమూలల సేవలందించి దేశానికి, చదువుకున్న విద్యా సంస్థకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు

అకాడమీ కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 50 ఏళ్ల క్రితం నిస్వార్థంతో ప్రారంభమైన అకాడమీ నేడు అంచెలంచెలుగా ఎదిగి వేల మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. సిద్ధార్థ అకాడమీ ఎన్నో దశాబ్దాలుగా విద్యా రంగంలో నాణ్యమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖర్చుకు వెనుకాడకుండా విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు లక్ష్యంగా విద్యను అందిస్తోందని చెప్పారు. అందుకు అకాడమీ అందజేస్తున్న సహకారం ఎనలేనిదని కొనియాడారు. విద్యాసంస్థలో తమ బిడ్డలను చదివించిన తల్లిదండ్రులను అభినందించారు. ఇక్కడ చదవడం అదృష్టమని, అది మీ అందరి పూర్వజన్మ సుకృతంగా పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎంవీ రామోజీరావు, కన్వీనర్ వి.నాగసాయి, మధుసూదన్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



తాడిగడపలో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా మహిళలు

పెనమలూరు: మచిలీపట్నంలో బాలికపై లైంగిక దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తాడిగడప కార్మికనగర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. మండల ఐద్వా కార్యదర్శి పుసునూరు పాతాళలక్ష్మి మాట్లాడుతూ మచిలీపట్నంలో 8 ఏళ్ల బాలికను నలుగురు యువకులు లైంగికదాడి చేయటం దారుణమన్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా తల్లిదండ్రులు ఆడ పిల్లలను పాఠశాల, కాలేజీలకు పంపాలంటే ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై అత్యాచారాలు నానాటికి పెరిగిపోతున్నాయన్నారు. నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవటంతోనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు లావణ్య, ఉప్పాడ త్రిమూర్తి, సీహెచ్.భవాని, ఉప్పాడ ఈశ్వరి, గంగా, రోజామణి, ఎం.వరలక్ష్మి, రోజా, దాసరి రమణమ్మ, లక్ష్మినారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులను భయాందోళనకు గురిచేయడం దుర్మార్గం

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రాజ్




భవానీపురం(విజయవాడపశ్చిమ): పింఛన్ల తనిఖీ పేరుతో వివిధ సాకులు చూపించి దివ్యాంగుల పింఛన్ల ఏరివేతకు చంద్రబాబు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంపద సృష్టిలో భాగంగా దివ్యాంగుల కడుపు కొట్టటానికి ప్రభుత్వం సన్నాహాలు చేయటం సిగ్గుచేటని తెలిపారు. దివ్యాంగుల పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల వెరిఫికేషన్ సాకుతో జనవరి నెల నుంచి మే నెల వరకు సదరం సర్టిఫికెట్ల జారీ నిలుపు చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించటం దారుణమని పేర్కొన్నారు. ఐదు నెలలపాటు సదరం సర్టిఫికెట్ జారీ చేయకపోతే దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. నిలుపుదల గురించి ప్రకటించిన అధికారులు మళ్లీ ఎప్పుడు పునఃప్రారంభిస్తారో ప్రకటించక పోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. నూతన సదరం సర్టిఫికెట్లు ఎప్పుడు జారీ చేస్తారు.. పింఛన్లు ఎప్పటికి మంజూరవుతాయని దివ్యాంగులు మానసికంగా తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లతోపాటు దివ్యాంగుల పింఛన్లుకూడా ఏరివేతే లక్ష్యంగా ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. వెరిఫికేషన్ ప్రక్రియ కోసం నెలల తరబడి సమయం తీసుకోవడం కుట్రలో భాగమేనని తెలిపారు. ఓ వైపు పింఛన్లు పెంచామని ప్రచారం చేసుకుంటూనే మరో వైపు ఏరివేత కార్యక్రమం చేపట్టి లబ్ధిదారులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ఇప్పుడు దివ్యాంగులను సైతం వదలకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఇప్పటికైనా పింఛన్ల తనిఖీ ప్రక్రియకు స్వస్తి చెప్పాలని కోరారు.

గ్రీటింగ్ కార్డుల తయారీ పోటీలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గ్రీటింగ్ కార్డులు తయారు చేయడంతో విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి పెరుగుతుందని స్ఫూర్తి క్రియేటివ్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ చెప్పారు. స్థానిక గాయత్రీనగర్‌లోని స్కూల్ ఆవరణలో గ్రీటింగ్ కార్డుల తయారీ పోటీలు ఆదివారం జరిగాయి. నగరంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు స్వయంగా రంగుల పేపర్లపై బొమ్మలు గీసి వివిధ డిజైన్లల్లో అందంగా గ్రీటింగ్ కార్డులను తయారు చేశారు. విద్యార్థులను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా శిక్షణ పూర్తి చేసిన వారితో నిర్వాహకులు

పెనమలూరు: యోగా చేయటంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా జీవించగలుగుతామని శ్రీ వెంకటేశ్వర యోగా కేంద్రం ఉప ప్రధాన యోగాచార్యులు మంద్రు శ్రీనివాసరావు అన్నారు. పెనమలూరు సెంటర్ కిలారు అనిల్ ఎస్టేట్‌లో ఆదివారం 64వ బ్యాచ్ ఉచిత యోగా శిక్షణ ముగించిన, అలాగే 65వ బ్యాచ్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యోగా చేయటంతో అనేక రుగ్మతలకు దూరంగా ఉండగలుగుతామన్నారు. యోగా చేసిన వారు ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగి మహానుభావులు అయ్యారని తెలిపారు. ప్రతీ ఒక్కరూ క్రమం తప్పకుండా యోగాను అభ్యసించాలని సూచించారు. యోగా గురువు శ్రీవెంకటేశ్వర యోగా గురువు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా యోగా శిక్షణ ముగించిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పలువురు యోగా గురువులను సత్కరించారు. కార్యక్రమంలో యోగా గురువులు నేరెళ్ల తులసీకృష్ణ, కొక్కిలిగడ్డ వెంకటకృష్ణ, పాల్గొన్నారు. యోగా శిక్షణ తరగతుల్లో చేరేవారు 91333 06804 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



ఉయ్యూరు: రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో చెస్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన పోటీలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి మేధోశక్తిని పెంపొందించేందుకు చెస్ పోటీలు నిర్వహించామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతగా చదరంగం రాష్ట్ర స్థాయి క్రీడాకారిణి కీర్తి వ్యవహరించారు. రోటరీ ప్రతినిధులు సయ్యద్ అనిస్, సీకే వసంతరావు, వెంకటేశ్వరరావు, అమీర్ మీర్జా, బొమ్మారెడ్డి సాంబశివారెడ్డి పాల్గొన్నారు.